

జడ్చర్ల టు నంద్యాల

జడ్చర్ల - నంద్యాల కొత్త రైల్వే లైన్ మంజూరు ప్రతిపాదన తెరపైకి వచ్చింది.

వివరాలు 8లో ▸



జూరాలకు పెరిగిన వరద

ఎగువ నుంచి వస్తున్న వరదతో జూరాలలో నీటిమట్టం పెరుగుతోంది.

వివరాలు 8లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
37.1 /22.2

వాతావరణం

అప్పుడప్పుడు ఆకాశం మేఘావృతం అవుతుంది. అడపాదడపా మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి



మక్తల్: విద్యార్థులు క్రీడల్లో రాణించాలని డీవైఎస్‌ఓ వెంకటేశ్‌శెట్టి, ఎంఈఓ అనిల్‌గౌడ్ అన్నారు. బుధవారం క్రీడా పాఠశాలలో నాల్గో తరగతిలో ప్రవేశాల నిమిత్తం పట్టణంలో ఎంపిక పోటీలు నిర్వహించారు. మొత్తం 30 మంది బాలబాలికలు పాల్గొన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ పీఈటీ గోపాలం, విష్ణువర్ధన్, రాజేశ్వరి, దామోదర్, రమేష్, రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.

రేపు మంత్రి పొన్నం రాక

పాలమూరు: జిల్లాకేంద్రంలో ఈనెల 20న రాష్ట్ర రవాణా, బీసీ వెల్ఫేర్ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పర్యటించనున్నారు. ఉమ్మడి జిల్లాలో ఉన్న ఆర్టీఏ, ఆర్టీసీ, బీసీ వెల్ఫేర్ శాఖల అధికారులతో కలెక్టరేట్‌లో సమీక్ష సమావేశం నిర్వహించనున్నారు. అధికార యంత్రాంగంతో పాటు ఆయా జిల్లాల కలెక్టర్లు సైతం ఈ సమావేశానికి హాజరుకానున్నారు. ఈ మేరకు ఆయా శాఖల అధికారులు సమీక్ష సమావేశానికి సన్నద్ధం అవుతున్నారు.

ఉల్లి క్వింటాల్ రూ.2,100



దేవరకద్ర/జడ్చర్ల: ఉల్లి సీజన్ తగ్గిపోవడంతో బుధవారం దేవరకద్ర మార్కెట్‌కు ఉల్లి రావడం తగ్గింది. ఐదు నెలలుగా కొనసాగిన ఉల్లి సీజన్ మూడు వారాల నుంచి తగ్గడంతో ధరలు కొంత మేర పెరిగాయి. మార్కెట్‌కు కేవలం 200 బస్తాల ఉల్లి అమ్మకానికి వచ్చింది. వేలంలో ఉల్లి క్వింటాల్ ధర గరిష్ఠంగా రూ.2,100, కనిష్ఠంగా రూ.1,100గా పలికింది. మార్కెట్‌కు వచ్చిన ఉల్లిని ఎక్కువగా వినియోగదారులే కొనుగోలు చేశారు. వ్యాపారులు బస్తాకు రూ. 50 నుంచి రూ. 100 వరకు లాభం చూసుకుని ఉల్లిని విక్రయించారు. బాదేపల్లి వ్యవసాయ మార్కెట్‌లో మొక్కజొన్న క్వింటాల్ గరిష్ఠంగా రూ.2,267, కనిష్ఠంగా రూ.1,569, ఆర్ఎన్ఆర్ గరిష్ఠంగా రూ.2,139, కనిష్ఠంగా రూ.1869 ధర పలికాయి.

కొత్త రైతులకు అవకాశం

'రైతు భరోసా'కు రేపటితో ముగియనున్న దరఖాస్తు గడువు

- జిల్లాలో 12,950 మందికి కొత్త పాసుపుస్తకాలు
- ఇప్పటికే 25,929 మంది రైతుల ఖాతాల్లో రూ.38.90 కోట్లు జమ



నారాయణపేట: రైతులకు ఆర్థిక భద్రత కల్పించే లక్ష్యంతో అమలు చేస్తున్న రైతు భరోసా పథకం కొత్తగా పాసు పుస్తకాలు పొందిన రైతులు సైతం పొందేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. జూన్ 5 వరకు పట్టా పాసుపుస్తకాలు పొందిన రైతుల నుంచి ఈ నెల 20 వరకు దరఖాస్తులు స్వీకరించనుంది. కొత్త పట్టా పాసుపుస్తకం , బ్యాంక్ ఖాతా, ఆధార్ జిరాక్స్ లతో సంబంధిత ఏఈఓల వద్ద రైతులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి జాన్‌సుధాకర్ సూచించారు.

12వేల మంది కొత్త రైతులు

గతేడాది జూన్ నుంచి ఈ ఏడాది జూన్ 5 వరకు 13 మండలాల్లోని 253 రెవెన్యూ గ్రామాల్లో 12,950 కొత్త పట్టా పాసుపుస్తకాలు ఉన్నట్లు అధికారుల లెక్కల ద్వారా తెలుస్తోంది. కాగా గతేడాదికి సంబంధించి 8 వేల మంది పట్టా పాసు పుస్తకాలు పొందిన రైతులు ఉండగా.. ఈ ఏడాది జనవరి నుంచి జూన్ వరకు మరో 4,950 మంది పొందారు. గతేడాదిలో ఒక సారి మాత్రమే పెట్టుబడి సాయం అందడంతో కొత్త పట్టా పాసు పుస్తకం పొందిన వారికి రైతు భరోసా దక్కలేదని రైతులు వాపోయారు. ఈ ఏడాది వానాకాలంలో రైతు భరోసాను ఎకరాలతో సంబంధం లేకుండా అందరికీ వేస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో రైతులు ఆనందం వ్యక్తం చేశారు. కాగా కొత్త పట్టా పాసు పుస్తకాలు పొందిన రైతులు సైతం దరఖాస్తు చేసుకోవాలని ఆదేశాలు రావడం.. ఈ నెల 20 వరకు గడువు విధించడంతో రైతులు దరఖాస్తు చేసుకునేందుకు కార్యాలయాల వద్దకు పరుగులు పెడుతున్నారు.



ఊట్కూర్‌లో రైతు భరోసాకు దరఖాస్తు చేసుకుంటున్న కొత్త పట్టా పాసుపుస్తకం పొందిన రైతులు

గడువు పెంచితే బాగుండు..



మా పొలం దగ్గర ఉన్న నాలుగు గుంటల భూమి కొనుగోలు చేశా. రైతు భరోసా కోసం ఇటీవల స్థానిక రైతు వేదిక దగ్గర ఏఈఓకు దరఖాస్తు చేసుకున్నా. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసాను అందరికి వేస్తామని చెప్పడం ఆనందంగా ఉంది. కొత్త పట్టపాసుపుస్తకాలు వచ్చిన రైతులకు సైతం వెంటనే అప్‌లోడ్ చేసి రైతుభరోసా వేయాలని కోరుతున్నాం. ఈ నెల 20వరకు పెట్టిన గడువును పెంచితే బాగుంటుంది.

– ఉప్పరి రవీందర్, రైతు, వర్కూర్ గ్రామం, మాగనూర్ మండలం

సద్వినియోగం చేసుకోవాలి

జూన్ 5వ తేదీ వరకు కొత్తగా పట్టా పాసు పుస్తకాలు పొందిన వారు రైతు భరోసా కోసం దరఖాస్తు చేసుకోవాలి. ఈ నెల 20వ తేదీ వరకు ఏఈఓలను కలిసి ఆధార్, బ్యాంకు ఖాతా, పట్టా పాసుపుస్తకాల జిరాక్స్ కాపీలను అందజేయాలి. ఆ తర్వాత పరిశీలించి ఆన్‌లైన్‌లో నమోదు చేస్తాం. వారికి సైతం రైతు భరోసా వస్తుంది. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– జాన్‌సుధాకర్, డీఏఓ

3 ఎకరాల్లోపు వారికి నిధులు జమ

మూడు ఎకరాల వరకు జిల్లాలోని 25,929 రైతుల ఖాతాలో రూ. 38.90 కోట్లు నగదు జమ అయినట్లు వ్యవసాయ శాఖ అధికారులు పేర్కొన్నారు. ఈ నెల 16న జిల్లాలోని రెండు ఎకరాల వరకు 94,354 రైతుల ఖాతాలో రూ.59.10 కోట్లు రైతు భరోసా నిధులు జమ కాగా ఎకరాలతో సంబంధం లేకుండా మిగిలిన వారందరికీ రైతు భరోసా నిధులు మరో వారం రోజుల్లో జమ అవుతాయని అధికారులు పేర్కొన్నారు. ఇదిలాఉండగా, గతేడాది 40 శాతం మంది రైతులకు రైతు భరోసా అందకపోవడంతో తీవ్ర నిరాశలో ఉన్నారు. ఈ ఏడాది ఎకరాలకు సంబంధం లేకుండా అర్హులైన ప్రతి రైతుకు నేరుగా వారి ఖాతాల్లో జమ చేస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో ఓ వైపు ఆనందం మరో వైపు నిరాశ వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో 13 మండలాల పరిధిలోని 4.59 లక్షల ఎకరాల సాగు భూముల్లో 1.75 లక్షల మంది రైతులు అర్హులుగా ఉండగా వారిలో గతేడాది 1.42 లక్షల మందికి మాత్రమే రైతు భరోసా అందింది. ఇంకా 33 వేల మంది రైతులకు రూ.93 కోట్లు అందాల్సి ఉంది. ఆ నగదు సైతం వేయాలని రైతులు కోరుతున్నారు.

ఎఫ్‌సీ లేని 30 స్కూల్ బస్సులు సీజ్



మహబూబ్‌నగర్‌లో స్కూల్ బస్సులను తనిఖీ చేస్తున్న ఎంవీఐలు రఘుకుమార్, వాసుదేవ్‌రావు

పాలమూరు: ఉమ్మడి జిల్లావ్యాప్తంగా రవాణా శాఖ అధికారులు ఫిట్‌నెస్ లేకుండా రోడ్లపై తిరుగుతున్న ప్రైవేట్ స్కూల్ బస్సులను సీజ్ చేయడానికి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ఈ నెల 12 నుంచి జిల్లాలో అన్ని రకాల పాఠశాలలు పునఃప్రారంభం అయిన క్రమంలో ఉమ్మడి జిల్లాలో 1,429 స్కూల్ బస్సులు ఉంటే ఇప్పటి వరకు 1,066 బస్సులకు ఫిట్‌నెస్ పరీక్షలు పూర్తి చేసుకోగా ఇంకా 363 బస్సులకు పరీక్షలు పూర్తి కాలేదు. దీంతో ఎంవీఐల ఆధ్వర్యంలో ఉదయం , సాయంత్రం వేళలలో రోడ్లపై తనిఖీలు నిర్వహిస్తున్నారు. నాలుగు రోజులుగా ఉమ్మడి జిల్లాలో 30 స్కూల్ బస్సులు సీజ్ చేశారు. మహబూబ్‌నగర్‌లో బుధవారం ఉదయం, సాయంత్రం ఆర్టీఏ అధికారులు ప్రత్యేకంగా తనిఖీలు నిర్వహించారు. ప్రతి స్కూల్ బస్సుకు సంబంధించి ఎఫ్‌సీ (ఫిట్‌నెస్ సర్టిఫికెట) కచ్చితంగా ఉండాలని, లేకుండా రోడ్లపై తిరిగితే సీజ్ చేస్తామని డీటీసీ కిషన్ హెచ్చరించారు.

జిల్లా	స్కూల్ బస్సులు	ఎఫ్‌సీ అయినవి	పెండింగ్	సీజ్
మహబూబ్‌నగర్	491	375	116	7
నాగర్‌కర్నూల్	276	184	92	5
వనపర్తి	252	182	70	2
గద్వాల	257	220	37	5
నారాయణపేట	153	105	48	11

ఆస్పత్రి నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించాలి



మక్తల్‌లో ఆస్పత్రి నిర్మాణ పనులు పరిశీలిస్తున్న మంత్రి వాకిటి శ్రీహరి

మక్తల్: పట్టణంలో చేపట్టిన 150 పడకల ఆస్పత్రి నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించాలని, ఎక్కడా ఎలాంటి లోపాలు లేకుండా యుద్ధ ప్రాతిపదికగా చేపట్టాలని రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. బుధవారం పట్టణంలో ఆస్పత్రి నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేస్తుందని, ప్రజలకు సేవ చేయడమే నా లక్ష్మమని, నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని మంత్రి అన్నారు. మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం ఆయన ఆస్పత్రి పనులను మొదటిసారిగా పరిశీలించారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మారెడ్డి, హన్మంతు, చంద్రకాంత్‌గౌడ్, కోళ్ల వెంకటేష్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి' పనుల్లో వేగం పెంచాలి



అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

నారాయణపేట: జిల్లాలో కొనసాగుతున్న ఉపాధి హామీ పథకం పనుల్లో వేగం పెంచాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్‌తో కలిసి ఉపాధి హామీ పనులు, ఇందిరా మహిళ శక్తి భవన నిర్మాణం, ఇందిర్మ ఇళ్లు, ఇందిరమ్మ భరోసా తదితర పనులపై అధికారులతో సమీక్షించారు. మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పనులపై కలెక్టర్ దిశా నిర్దేశం చేశారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేసుకునేలా క్షేత్రస్థాయిలో లబ్ధిదారులకు అవగాహన కల్పించాలన్నారు. వనమహోత్సవంలో భాగంగా జిల్లాకు ఇచ్చిన లక్ష్యం ప్రకారం వంద శాతం మొక్కలు నాటేలా ప్రణాళిక రూపొందించాలన్నారు. పాఠశాల ఆవరణలో బ్లీచింగ్ పౌడర్‌ను చల్లించి పరిసరాలు శుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఎంపీడీవోలు నిరంతరం పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేయాలని, వంటకు పామాయిల్ వినియోగించకుండా చూడాలని, గ్యాస్ కనెక్షన్ ద్వారానే మధ్యాహ్న భోజనం వండేలా ఏజెన్సీ నిర్వాహకులను ఆదేశించాలన్నారు. జెడ్పీ సీఈవో శైలేష్ కుమార్, డీఎస్‌పీఓ లింగయ్య, డీఆర్‌డీఓ మొగులప్ప, ఎంపీడీవోలు, ఏపీఓలు పాల్గొన్నారు.

కలెక్టరేట్ నిర్మాణ పనులు వేగవంతం

సమీకృత జిల్లా కలెక్టర్ కార్యాలయ నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ అధికారులను ఆదేశించారు. బుధవారం సింగారం వద్ద నిర్మిస్తున్న ఐడీఓసి (సమీకృత జిల్లా కలెక్టర్ కార్యాలయ)పనులను కలెక్టర్ పర్యవేక్షించారు. వివిధ గదులు, వాటిలో కొనసాగుతున్న పనులు ఎప్పటిలోగా పూర్తవుతాయని అధికారులతో ఆరా తీశారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ త్వరగా పూర్తిచేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

ప్రభుత్వ బడుల బలోపేతమే లక్ష్యం



విద్యార్థులను అభినందిస్తున్న ఎమ్మెల్సీ పింగళి శ్రీపాల్‌రెడ్డి, కలెక్టర్ సిక్తా పట్నాయక్

నారాయణపేట రూరల్: అభివృద్ధి చెందిన దేశాల మాదిరి పాఠశాల స్థాయి విద్య ప్రభుత్వ ఆధీనంలోనే ఉండాలని.. ప్రభుత్వ ఉపాధ్యాయులు సమష్టిగా కృషిచేసి ప్రభుత్వ బడులను బలోపేతం చేసేందుకు కంకణబద్ధులు కావాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగళి శ్రీపాల్ రెడ్డి అన్నారు. నారాయణపేటలో పీఆర్టీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన టెన్త్ విద్యార్థుల అభినందన సభకు కలెక్టర్ సిక్తా పట్నాయక్‌తోపాటు ఆయన ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రైవేటు, కార్పొరేట్ వ్యవస్థను తొలగించి ప్రాథమిక విద్యకు కేవలం ప్రభుత్వ పాఠశాలలను కొనసాగిస్తే దేశం అభివృద్ధి చెందుతుందని అన్నారు. చిన్నతనంలోనే ఒత్తిడితో కూడిన విద్యను అభ్యసించడం వల్ల పిల్లలు మానసికంగా, శారీరకంగా ఎదగలేక పోతున్నారని, సర్కారు బడిలో స్వేచ్ఛాయుతమైనటువంటి విద్యాభ్యాసం జరుగుతుందని తల్లిదండ్రులు గుర్తించాలన్నారు. రాష్ట్రంలో విద్యాశాఖ ముఖ్యమంత్రి దగ్గర ఉందని, ఆయన విశేష కృషితో విద్యారంగం అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. పర్యవేక్షణ అధికారుల పోస్టులైన డీఈఓ, డిప్యూటీ ఈఓ, ఎంఈఓ పోస్టులను అవసరమైన చోట మంజూరు చేసి ఖాళీ స్థానాలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాలో 30 ప్రభుత్వ పాఠశాలలు 100శాతం ఉత్తీర్ణత సాధించడం ఆనందంగా ఉందన్నారు.

విద్యార్థుల సంఖ్య పెంచాలి

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు ప్రతి ఉపాధ్యాయుడు కృషి చేయాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. గతంలో కంటే సర్కారు బడుల్లో 20శాతం చేరిక తగ్గిందని, రాబోయే రోజుల్లో సంఖ్య మరింత మెరుగుపడే విధంగా విద్యాశాఖ చర్యలు చేపట్టాలన్నారు. టెన్త్ లో చక్కటి ఫలితాలకు జిల్లాలో ప్రణాళిక బద్ధంగా విద్యార్థులను సిద్ధం చేశారని, వేక్ అప్ కాల్, ఇంటికి తలుపు తట్టు కార్యక్రమాలతోపాటు రివిజన్ టెస్టులునిర్వహించి ఉత్తీర్ణత శాతాన్ని పెంచారన్నారు. అనంతరం పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు గుండు లక్ష్మణ్, పుల్గం దామోదర్‌రెడ్డి మాట్లాడుతూ.. దీర్ఘకాలికంగా అపరిష్కృతంగా ఉన్న పదోన్నతులు, బదిలీల ప్రక్రియతో పాటు పండిట్ పీఈటీల అప్‌గ్రేడ్ సమస్యను పీఆర్టీయూ పరిష్కరించిందని, 317 బాధితులకు విడతల వారీగా న్యాయం చేస్తామన్నారు. టీచర్ల హక్కులతో పాటు విద్యారంగాన్ని అభివృద్ధి చేసే బాధ్యత సంఘం భుజాన వేసుకుని నడిపిస్తుందన్నారు. అనంతరం టాపర్లుగా నిలిచిన 200మంది విద్యార్థులతో పాటు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులను శాలువా, జ్ఞాపిక, ప్రశంసా పత్రంతో అభినందించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షులు యాద్గీర్ జనార్దన్ రెడ్డి, కార్యదర్శి వెంకటరెడ్డి, యాదగిరి, డీఈఓ గోవిందరాజు, డీఎస్‌ఓ భాను ప్రకాష్, గ్రంథాలయ చైర్మన్, మార్కెట్ కమిటీ చైర్మన్ శివారెడ్డి, వకీల్ సంతోష్ కుమార్, భీష్మరాజ్ ఫౌండేషన్ చైర్మన్ రాజ్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

యోగాతో మానసిక ప్రశాంతత



కరపత్రం విడుదల చేస్తున్న యోగా క్లబ్ సభ్యులు

నారాయణపేట రూరల్: ఒత్తిడిని అధిగమించేందుకు ప్రతి ఒక్కరూ యోగ జీవితంలో భాగంగా మార్చుకుంటే మానసిక ప్రశాంతత లభిస్తుందని సేవా భారతి ప్రతినిధి డాక్టర్ మదన్ మోహన్ రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని సిటిజన్ క్లబ్ ఆవరణలో బుధవారం యోగా క్లబ్ నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని కరపత్రం విడదల చేసి మాట్లాడారు. జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం ప్రపంచవ్యాప్తంగా 198 దేశాల్లో నిర్వహిస్తున్నారని చెప్పారు. నిత్యజీవితంలో శారీరకంగా, మానసికంగా ఎన్నో ఒడిదుడుకులు ఎదురవుతుంటాయని వాటన్నింటినీ అధిగమించి ఆరోగ్యంగా ఉండడానికి యోగ ఎంతో ఉపయోగ పడుతుందన్నారు. ప్రతిరోజు ఉదయం 7గంటలకు ప్రభుత్వ ఆసుపత్రిలో యోగా తరగతులను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇదిలాఉండగా, ఈనెల 21న స్థానిక అభినందన్ గార్డెన్ ఫంక్షన్ హాల్ లో ఉదయం 6గంటల నుంచి 8గంటల వరకు సామూహిక యోగా దినోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 19న పాఠశాల, కళాశాల విద్యార్థులకు నేటి సమాజానికి యోగా ఆవశ్యకత అనే అంశంపై వ్యాసరచన పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందిస్తామని తెలిపారు. సమావేశంలో సురేష్, రాజేంద్ర లాహోటి, ల్యాబ్ శివకుమార్, క్యాతన్ రఘు, నరసింహులు, బాలకృష్ణ, రజిత, జ్యోతి, రాణి, శిరీష, ఉమాదేవి, మల్లికార్జున్, శ్రీనివాస్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

● ఫీ'జులుం'

నిలువు దోపిడీ

- ప్రైవేటు పాఠశాలల్లో తడిసి మోపెడవుతున్న ఫీజులు
- ఐఐటీ, నీట్ ఫౌండేషన్ పేరుతో అదనపు వసూళ్లు
- బడుల్లోనే పుస్తకాలు, యూనిఫామ్స్ విక్రయాలు
- చూసీ చూడనట్టు వ్యవహరిస్తున్న విద్యాశాఖ అధికారులు



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్/అచ్చంపేట: తమ పిల్లలను ఉన్నతంగా ప్రైవేటు బడుల్లో చదివించాలన్న తల్లిదండ్రుల ఆశ కొన్ని ప్రైవేటు పాఠశాలలకు కాసుల పంట పండిస్తోంది. విద్యాశాఖ అధికారుల వైఫల్యం, తల్లిదండ్రుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని ఉమ్మడి జిల్లాలో ప్రైవేటు విద్యాసంస్థలు ఆడిందే ఆట.. పాడిందే పాటగా మారింది. ఫీజుల నియంత్రణ లేకపోవడంతో ఎల్‌కేజీ విద్యార్థికి సైతం రూ.వేలల్లో వసూలు చేసే పరిస్థితి నెలకొంది. దీనికి తోడు ఐఐటీ, నీట్ ఫౌండేషన్ల పేరుతో అదనంగా ఫీజులు వసూలు చేస్తున్నారు. బస్ ఫీజులు, పుస్తకాలు, యూనిఫాం, షూ, టై, బెల్టు అంటూ ముక్కు పిండి మరీ వసూలు చేస్తున్నారు. ప్రైవేటు పాఠశాలలను నియంత్రించాల్సిన విద్యాశాఖ అధికారులు మాత్రం తమకేమీ పట్టనట్టు వ్యవహరిస్తున్న తీరు తీవ్ర విమర్శలకు తావిస్తోంది.

ఇవీ నిబంధనలు..

- ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థులకు సరిపడా తరగతి గదులు ఉండాలి.
- భవన నిర్మాణ నాణ్యత ధ్రువపత్రం ఉండాలి.
- విద్యార్థుల మానసిక ఎదుగుదల కోసం ఆట స్థలం, లైబ్రరీ, ప్రహరీ, అగ్నిమాపకశాఖ జారీ చేసిన నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ ఉండాలి.
- తాగునీటి వసతి, ప్రథమ చికిత్స, కంప్యూటర్ గది, సిబ్బంది గది, మూత్రశాలలు, మరుగుదొడ్లు కచ్చితంగా ఉండాలి.
- విద్యా హక్కు చట్టం ప్రకారం బీఎడ్, డీఎడ్ పూర్తిచేసిన వారు బోధన చేయాలి.
- పిల్లలు రోడ్డు దాటడానికి సౌకర్యం కల్పించాలి.
- పోషకుల కమిటీ, ఫీజు వివరాలు నోటీస్ బోర్డుపై ఏర్పాటు చేయాలి. ప్రభుత్వ పుస్తకాలతోనే విద్యాబోధన చేయాలి. ఒక తరగతి గదిలో 40 మంది విద్యార్థులు దాటితే మరో సెక్షన్ కోసం అనుమతి తీసుకోవాలి. ప్రీ ప్రైమరీ కోసం అనుమతి తప్పనిసరి.

పోటీ పడి మరీ..

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 1,350 ప్రైవేటు పాఠశాలలు ఉండగా.. 1.90 లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారు. ఈ విద్యా సంవత్సరం పలు కొత్త ప్రైవేటు స్కూల్స్ ఏర్పాటు కావడంతో తీవ్ర పోటీ నెలకొంది. ఫీజులు పెద్దఎత్తున పెరిగిపోయాయి. అడ్మిషన్ ఫీజుతో మొదలుకొని అనేక రకాలుగా దోచుకుంటున్నారు. ఎల్‌కేజీ విద్యార్థికి దాదాపుగా రూ.20 వేలు.. 2, 3 తరగతుల వారికి రూ.20 వేల నుంచి రూ. 30 వేల వరకు.. 9, 10 తరగతుల వారికి రూ.50 వేల నుంచి రూ.60 వేల వరకు వసూలు చేస్తున్నారు. వీటికి తోడు ఐఐటీ, నీట్ ఫౌండేషన్ కోర్సులంటూ రూ.15 వేల నుంచి రూ.20 వేల వరకు అదనంగా వసూలు చేస్తున్నారు. మరోవైపు పాఠశాలల్లోనే పుస్తకాలను యథేచ్ఛగా విక్రయిస్తున్నారు. కొన్ని పాఠశాలలు యూనిఫామ్స్ సైతం విక్రయిస్తుండగా.. మరికొన్ని పలు గార్మెంట్ సంస్థలతో ఒప్పందం ప్రకారం యూనిఫామ్స్ విక్రయాలు సాగిస్తున్నారు.

కనీస సౌకర్యాలు కరువు..

పాఠశాల తరగతి గదుల్లో వెలుతురు, గాలితో పాటు శుభ్రత ఉండాలి. అయితే ఉమ్మడి జిల్లాలోని చాలా పాఠశాలల్లో రేకుల షెడ్లే తరగతి గదులుగా కొనసాగుతున్నాయి. వెలుతురు లేకపోగా.. ఫ్యాన్లు కూడా సక్రమంగా తిరగని పరిస్థితి ఉంది. మెజార్టీ పాఠశాలల్లో పిల్లలు ఆడుకోవడానికి ఆట స్థలాలు లేవు. పిల్లలను ఉదయం 9నుంచి సాయంత్రం వరకు పాఠశాల గదుల్లో యాజమాన్యాలు బంధిస్తున్నాయి. దీంతో విద్యార్థుల్లో మానసిక వికాసం తగ్గిపోతుందని పలువురు ఆందోళన చెందుతున్నారు.

సొంత సిలబస్ బోధన..

అన్ని పాఠశాలల్లో ప్రభుత్వం సూచించిన సిలబస్ మాత్రమే బోధించేలా అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంది. కానీ కొన్ని కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలలు స్టేట్ సిలబస్‌ను పక్కన పెట్టి.. ఒకటి నుంచి ఐదో తరగతి వరకు సొంత సిలబస్ బోధిస్తున్నారని తెలుస్తోంది. నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ వంటి వాటికి ప్రభుత్వం ఇప్పటికీ సిలబస్‌ను సూచించలేదు. కానీ వారికి కూడా ప్రైవేటు పబ్లికేషన్స్‌లో సిలబస్ తయారు చేసి విద్యార్థులకు బోధిస్తున్నారు. ప్రైవేటు కరికులమ్‌కు ఒక్కో విద్యార్థికి రూ.3 వేల నుంచి రూ.4 వేల వరకు వసూలు చేస్తున్నారు. కేవలం ప్రభుత్వ సిలబస్ పుస్తకాలను విక్రయిస్తే రూ.500 నుంచి రూ.1000 మాత్రమే ఖర్చయ్యే అవకాశం ఉంటుంది.

దోపిడీ చేస్తున్నాయి..



ప్రైవేటు విద్యాసంస్థలు ఐఐటీ, నీట్ పేరుతో తల్లిదండ్రులను దోపిడీ చేస్తున్నాయి. ఇంటర్మీడియట్ తర్వాత బోధించాల్సిన సబ్జెక్టులను ఇప్పుడు బోధిస్తూ.. ఒక్కో విద్యార్థి నుంచి రూ.20వేల నుంచి రూ. 30వేల వరకు వసూలు చేస్తున్నారు. దీనిపై విద్యాశాఖ అధికారులకు సమాచారం ఇచ్చినా చర్యలు తీసుకోవడం లేదు.

– ప్రశాంత్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు, మహబూబ్‌నగర్

పుస్తకాలు సీజ్..



బాలానగర్ గీతాంజలి, జడ్చర్ల శ్లోక పాఠశాలల్లో పుస్తకాలు అమ్ముతుండగా పట్టుకొని సీజ్ చేయాలని ఎంఈఓలకు ఆదేశించాం. నిబంధనలకు విరుద్ధంగా పాఠశాలల్లో పుస్తకాలను విక్రయించొద్దు. పుస్తకాలు విక్రయిస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకునేందుకు ఎంఈఓలకు కలెక్టర్ పూర్తి ఆదేశాలు ఇచ్చారు. ఈ క్రమంలో జిల్లాస్థాయిలో తనిఖీలకు ఒక కమిటీ ఏర్పాటుకు కలెక్టర్‌కు నివేదించాం. త్వరలో పాఠశాలల్లో తనిఖీలు నిర్వహిస్తాం.

– ప్రవీణ్‌కుమార్, డీఈఓ, మహబూబ్‌నగర్

పేరుకే పేరెంట్స్ కమిటీలు..

ప్రతి పాఠశాలకు ఒక పేరెంట్స్ కమిటీ ఉండాలి. పాఠశాల యాజమాన్యాలు మాత్రం వారికి అనుకూలమైన వారిని పెట్టుకొని పేరెంట్స్ కమిటీలను కాగితాలకే పరిమితం చేస్తున్నాయి. చాలా పాఠశాలలు ఈ కమిటీలను కూడా వేయడం లేదు.

తాత్కాలిక బుక్ సెంటర్లు ఏర్పాటు..

కొంత మంది వివిధ బుక్ సెంటర్లలో పుస్తకాలను పెట్టి అమ్ముతుండగా.. మరి కొంత మంది బయట తాత్కాలిక షాప్‌లు ఏర్పాటు చేసి పుస్తకాలు అమ్ముతున్నారు. ఉమ్మడి జిల్లాలోని ప్రైవేటు పాఠశాలలకు ప్రైవేటు పబ్లికేషన్స్‌కు సంబంధించిన మెటీరియల్స్ సరఫరా చేసేందుకు మహబూబ్‌నగర్‌లోని షాషాబ్‌గుట్ట సమీపంలో గోదాం ఏర్పాటు చేయడం గమనార్హం.

క్లుప్తంగా

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

కొత్తకోట రూరల్: అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి చెందిన ఘటన పెద్దమందడి మండలం గట్లఖానాపూర్‌లో బుధవారం జరిగింది. ఎస్‌ఐ శివకుమార్ తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన రేణుక(41) భర్త లక్ష్మయ్య ఏడేళ్ల క్రితం మృతి చెందాడు. ఈ నేపథ్యంలో రేణుక అదే గ్రామానికి చెందిన కురుమూర్తి అనే వ్యక్తితో కొన్నేళ్లుగా పరిచయం ఉంది. ఈ క్రమంలో ఈ నెల 17న రాత్రి కురుమూర్తి రేణుక దగ్గరకు వచ్చాడు. ఇద్దరు కలిసి రాత్రి ఇంటి నుంచి బయటకు వెళ్లినట్లు మృతురాలి కుమార్తె తెలిపింది. ఎంత వరకు తల్లి ఇంటికి రాకపోవడంతో మృతురాలి పెద్ద కుమార్తె వెన్నెల చుట్టు పక్కల వెతకగా అదే వీధిలో ఎవరూ నివాసముండని ఇంట్లో తల్లి రక్తపు మడుగులో పడి ఉండటాన్ని గమనించి స్థానికులకు సమాచారం అందించింది. గ్రామస్తుల సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు పరిసర ప్రాంతాలు పరిశీలించారు. తన తల్లి చావుకు కురుమూర్తి కారణమంటూ అనుమానం వ్యక్తం చేస్తూ మృతురాలి కుమార్తె వెన్నెల ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతురాలికి ఐదుగురు సంతానం ఉన్నారు.

ఉరేసుకొని వివాహిత ఆత్మహత్య

భూత్పూర్: ఫ్యాన్‌కు ఉరేసుకొని వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని పెద్దతండాలో బుధవారం జరిగింది. ఎస్‌ఐ చంద్రశేఖర్ తెలిపిన వివరాలు.. అడ్డాకుల మండలం తిమ్మాయిపల్లి తండాకు చెందిన హర్యానాయక్ కుమార్తె బుజ్జిబాయి(42)కి మండలంలోని పెద్దతండాకు చెందిన రవినాయక్‌కు 18 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. రవినాయక్ మేస్త్రీ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. తరచూ మద్యం తాగి తరుచూ భార్యతో గొడవపడుతుండేవాడు. ఈ నేపథ్యంలో బుధవారం ఇంట్లో ఎవరులేని సమయంలో బుజ్జిబాయి ఫ్యానుకు ఉరేసుకొని బలవన్మరణానికి పాల్పడింది. బుజ్జిబాయి తండ్రి హర్యా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

సామాజిక మాధ్యమాల్లో అశ్లీల వీడియోలు

- యువకుడిపై కేసు నమోదు

గద్వాల క్రైం: సామాజిక మాధ్యమాల్లో అశ్లీల వీడియోలను అప్‌లోడ్ చేసి వైరల్ చేసిన యువకుడిపై బుధవారం పోలీసులు కేసు నమోదు చేశారు. పట్టణ ఎస్‌ఐ కళ్యాణ్‌కుమార్ వివరాల మేరకు.. జిల్లాకు చెందిన ఓ యువకుడు బాలికల పోర్న్ వీడియోలను ఇంటర్నెట్ నుంచి డౌన్‌లోడ్ చేసి.. సామాజిక మాధ్యమాలైన వాట్సప్, ఇన్‌స్టాగాం, ఫేస్‌బుక్‌లలో అప్‌లోడ్ చేశాడు. అయితే నేషనల్ క్రైం రికార్డ్స్ బ్యూరో విభాగం సిబ్బంది గుర్తించి.. తెలంగాణ పోలీస్‌శాఖకు సమాచారం అందించింది. అయితే విచారణలో జిల్లాకు చెందిన ఓ యువకుడు ఈ చర్యకు పాల్పడినట్లు గుర్తించారు. ఈ మేరకు సదరు యువకుడిపై రెండు కేసులు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. అసభ్యకరమైన వీడియోలను చూసినా, వాటిని సామాజిక మాధ్యమాల్లో వైరల్ చేసినా చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇంటర్నెట్ వినియోగం విషయంలో కొత్త విషయాలను తెలుసుకునే క్రమంలో అశ్లీలత, అసభ్యకరమైన వాటి విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

జడ్చర్ల టు నంద్యాల

మరోసారి తెరపైకి రైల్వేట్రాక్ ప్రతిపాదన!



- 2005లో సర్వేకు రూ.10కోట్ల కేటాయింపు
- నాగర్‌కర్నూలు వయా బండి ఆత్మకూర్ మీదుగా..
- 182 కి.మీ.కు రూ.565కోట్ల వ్యయం అంచనా
- అప్పట్లో ఆర్‌ఓఆర్ తక్కువని మూలన పడిన ఫైనం

జడ్చర్ల టౌన్: అన్నిరంగాల్లోనూ దినదినాభివృద్ధి చెందుతున్న జడ్చర్ల పట్టణం నుంచి నంద్యాల వరకు నూతన రైల్వేలైన్ మంజూరు చేయాలన్న ప్రతిపాదనలు తెరపైకి వచ్చాయి. ఈ మేరకు ఇటీవల స్థానికులు కొందరు ఎంపీ డీకే అరుణకు వినతిపత్రం అందించగా.. ఆమె సానుకూలంగా స్పందించడం గమనార్హం. వాస్తవానికి 2005–06లో అప్పటి రైల్వేశాఖ మంత్రి లాలుప్రసాద్ జడ్చర్ల-నంద్యాల రైల్వేలైన్ సర్వేకు రూ.10కోట్లు కేటాయించారు. సర్వే నిర్వహించినప్పటికీ ప్రతిపాదనలు ఎందుకు మూలనపడ్డాయో తెలియకుండా పోయింది. అన్నీ ఆశించినట్లు జరిగితే రైల్వేలైన్ మంజూరైతే ఈ ప్రాంతం నుంచి కడప, తిరుపతి, చెన్నై వెళ్లేవారికి దూరం తగ్గడంతోపాటు సమయం ఆదా అవుతుంది. సర్వే అనంతరం రేట్ ఆఫ్ రిటర్న్ లేనందున ప్రతిపాదనలు పెండింగ్‌లో ఉంచినట్లు రైల్వే అధికారుల ద్వారా తెలిసింది.

తెలంగాణలోనే పెద్ద వ్యాపారకేంద్రంగా పేరుగాంచిన జడ్చర్లకు పోలేపల్లి ఫార్మాసెజ్ కారణంగా అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది. జడ్చర్లకు 44, 167వ జాతీయ రహదారులతోపాటు రైల్వేలైన్ ఉండడంతో త్వరితగతిన అభివృద్ధి చెందుతుంది. ఇదేక్రమంలో జడ్చర్ల నుంచి నంద్యాల వరకు రైల్వేలైన్ వేయాలన్న డిమాండ్లు పెరుగుతున్నాయి. రైల్వేలైన్ వేయాల్సి వస్తే తెలంగాణ, ఆంధ్ర రాష్ట్రాల మధ్య రైళ్ల రాకపోకలు పెరిగే ఆస్కారం ఉంది.

సోమశిల మీదుగా రహదారి నిర్మాణం

ప్రస్తుతం హైదరాబాద్ నుంచి కల్వకుర్తి మీదుగా కొల్లాపూర్ నుంచి సోమశిల మీదుగా నంద్యాలకు రోడ్డుమార్గం పనులు కొనసాగుతున్నాయి. సోమశిల వద్ద కృష్ణానదిపై కేబుల్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టనున్నారు. జడ్చర్ల నుంచి రైల్వే లైన్ నాగర్‌కర్నూల్ మీదుగా కొల్లాపూర్ ద్వారా సోమశిల వద్ద కేబుల్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టే ప్రాంతం నుంచి నంద్యాలకు రోడ్డు పక్కనుంచి రైలుమార్గం వేస్తే అందరికీ అనుకూలంగా మారుతుంది. ఓవైపు రోడ్డు, మరోవైపు రైలు మార్గం ఉండడంతో ఆ ప్రాంతాలు అభివృద్ధికి ఆస్కారం కలుగుతుంది.

రైల్వేలైన్ ఇలా..

జడ్చర్ల రైల్వేస్టేషన్ నుంచి నాగర్‌కర్నూలు మీదుగా కృష్ణానదిని దాటుకుంటూ కర్నూలు జిల్లాలోని బండి ఆత్మకూర్ ద్వారా నంద్యాల రైల్వేస్టేషన్ వరకు మొత్తం 182 కి.మీ మేర రైల్వేలైన్ వేయాల్సి ఉంటుంది. దీనిద్వారా నాగర్‌కర్నూలు వాసులకు రైలు సౌకర్యం కల్పించినట్లవుతుంది.

ఇద్దరు ఎంపీలు సమన్వయంతో..

మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యులు డీకే అరుణ, మల్లురవి సమన్వయంతో ముందుకెళితే రైల్వేలైన్ సాధించే అవకాశాలు మెండుగా ఉన్నాయని పలువురు అభిప్రాయపడుతున్నారు. కేంద్రంలో బీజేపీ అధికారంలో ఉండడం జడ్చర్లకు ఎంపీగా అరుణ ప్రాతినిధ్యం వహిస్తుండడంతోపాటు కృష్ణానది తర్వాత కర్నూలు జిల్లా ప్రాంతం ఆంధ్రలో ఉండడం అక్కడ కూటమి ప్రభుత్వం అధికారంలో ఉన్నందున కీలకపాత్ర పోషించే అవకాశాలున్నాయి. ఇక నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యుడు మల్లురవి కృషిచేస్తే నాగర్‌కర్నూల్‌కు రైల్వేను పరిచయం చేసిన వ్యక్తిగా చరిత్రకెక్కుతారు.

ట్రాఫిక్ తక్కువగా ఉందని

జడ్చర్ల-నంద్యాల రైల్వేలైన్ కోసం 2005-06లో చేసిన సర్వేలో ట్రాఫిక్ తక్కువగా ఉందని, రేట్ ఆఫ్ రిటర్న్ 10శాతం తక్కువగా ఉండటం వల్ల ప్రతిపాదనలు ఆగిపోయాయి. ఇప్పుడు జనాభా రెంట్టింపు కావడంతో ట్రాఫిక్ సమస్య తీరడంతోపాటు ఆర్‌ఓఆర్ పెరిగే ఆస్కారం ఉంది. అందుకే ఎంపీ డీకే అరుణకు వినతిపత్రం అందజేశాం. ఎంపీ సానుకూలంగా స్పందించారు. జడ్చర్ల-నంద్యాల రైల్వేలైన్ అయితే జడ్చర్ల జంక్షన్‌గా మారేందుకు ఆస్కారం ఉంది.

– కంచుకోట ఆనంద్, సామాజిక వేత్త, బాదేపల్లి

ఎంపీని కలిసి విన్నవిస్తాం

జడ్చర్ల-నంద్యాల రైల్వేలైన్ ప్రతిపాదనలతో ఎంపీ డీకే అరుణను కలసి విన్నవిస్తాం. జడ్చర్ల నుంచి నాగర్‌కర్నూలు, కృష్ణానది మీదుగా బండి ఆత్మకూర్ ద్వారా నంద్యాల వరకు రైల్వేలైన్ వేయడం వల్ల అనేక ప్రయోజనాలున్నాయి. రైల్వేలైన్ మంజూరైతే జండ్చర్ల రైల్వేస్టేషన్ జంక్షన్‌గా అభివృద్ధి చెందేందుకు ఆస్కారం కలుగుతుంది. కేంద్రంలో మా పార్టీ ప్రభుత్వం అధికారంలో ఉన్నందున రైల్వేలైన్ సాధించేందుకు కృషిచేస్తాం.

– బాలవర్ధన్‌గౌడ్, బీజేపీ అధికార ప్రతినిధి, జడ్చర్ల నియోజకవర్గం

నంద్యాల-ఎర్రగుంట రైల్వేలైన్‌కు అనుసంధానం

జడ్చర్ల నుంచి నంద్యాలకు రైలుమార్గం వేస్తే ఇప్పటికే జంక్షన్‌గా ఉన్న నంద్యాల రైల్వేస్టేషన్ మరింత అభివృద్ధి చెందుతుంది. అదేవిధంగా ఈ మార్గం అటు నంద్యాల-ఎర్రగుంట రైల్వేలైన్‌కు లింక్ చేయడం వల్ల కడప వరకు నేరుగా రైళ్ల రాకపోకలకు అనువుగా మారుతుంది. రైల్వేలైన్‌కు భూసేకరణ సమస్యగా పరిణమించే అవకాశం ఉంది. ఈ కారణంగానే ప్రతిపాదనలు మూలనపడ్డాయా అన్న సందేహాలున్నాయి.

రూ.565కోట్లతో ప్రతిపాదనలు

2005లో సర్వే ప్రారంభించిన బృందం 2007లో రైల్వేబోర్డుకు నివేదిక సమర్పించింది. మొత్తం 170 కి.మీ మేర రూ.565కోట్ల 60లక్షలతో రైల్వేలైన్ నిర్మాణ వ్యయం అవుతుందని అంచనా వేసింది. అయితే పెట్టుబడికి రేట్ ఆఫ్ రిటర్న్ 10శాతం తక్కువగా ఉండడం, ఆశించిన మేర ట్రాఫిక్ లేదనే ఉద్దేశ్యంతో ప్రతిపాదనలు పక్కన పెట్టినట్లు బాదేపల్లికి చెందిన కంచుకోట ఆనంద్ రాసిన లేఖకు సమాధానంగా రైల్ నిలయం సికింద్రాబాద్ సీఏఓ నుంచి 2024లో సమాధానం వచ్చింది. అయితే 2005–06లో జనాభా తక్కువగా ఉండడం వల్ల ట్రాఫిక్ సరిపోదని తేల్చినా.. ఇప్పుడు రెండింతలు పెరగడం వల్ల రైల్వేలైన్ ప్రతిపాదనలు ముందుకొచ్చాయి. అదేవిధంగా లైన్ వేసేందుకు వ్యయం రెట్టింపయ్యే అవకాశాలున్నాయి.

నల్లమలలో ట్రైయినీ ఐఏఎస్‌లు



మన్ననూర్‌లోని ఈసీ సెంటర్ వద్ద ట్రైయినీ ఐఏఎస్‌లు

మన్ననూర్: అమ్రాబాద్ పులుల రక్షిత అభయారణ్యంలో బుధవారం మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో శిక్షణ పొందుతున్న 2024 బ్యాచ్ ఐఏఎస్‌లు సందర్శించారు. ఒక రోజు పర్యటనలో భాగంగా ట్రైయినీ ఐఏఎస్‌లు సౌరబ్ శర్మ, సలోనీ చాబ్రా, హర్ష చౌదరి, ఖర్లాన్ చిగ్తి యాన్వీ, ప్రణయ్‌కుమార్ సందర్శించి.. నల్లమల అభయారణ్యంలో ప్లాస్టిక్ నిషేధంపై అటవీశాఖ చేపడుతున్న చర్యలను తెలుసుకున్నారు. అదే విధంగా పులుల సంరక్షణ, చెంచుల సంక్షేమానికి చేపడుతున్న కార్యక్రమాలపై ఆరా తీశారు. ప్రకృతి ప్రియుల కోసం నిర్వహిస్తున్న సఫారీతో పాటు పలు పర్యాటక ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం లోతట్టు మారుమూల ప్రాంతాలైన సార్లపల్లి, కుడిచింతలబైలు గ్రామాల్లో ట్రైయినీ ఐఏఎస్‌లు పర్యటించినట్లు సంస్థ నోడల్ అధికారి డా.శ్రీనివాస్ తెలిపారు. వారి వెంట ఎఫ్‌ఎస్‌ఓ శ్రీకాంత్, బయోలజిస్టు మహేందర్ ఎఫ్‌బీఓలు మధుసూదన్, శివ తదితరులు ఉన్నారు.

చిన్నారికి శాశ్వత ఉచిత బస్‌పాస్ అందజేత



బస్‌పాసులను అందజేస్తున్న ఆర్టీసీ డీఎం

కొల్లాపూర్: ఆర్టీసీ బస్సులో జన్మించిన అమ్మాయికి శాశ్వత బస్‌పాసును అధికారులు అందించారు. కొల్లాపూర్ మండలం ఎల్లూరు గ్రామానికి చెందిన గర్భిణి సువర్ణమ్మ ఏప్రిల్ 15న నాగర్‌కర్నూల్‌కు వైద్య పరీక్షల నిమిత్తం వెళ్లింది. అక్కడి నుంచి ఆర్టీసీ బస్సులో స్వగ్రామానికి తిరిగి వస్తుండగా ఆమెకు పురిటి నొప్పులు వచ్చాయి. పెద్దకొత్తపల్లి సమీపంలో నొప్పులు ఎక్కువ కావడంతో ఆశావర్కర్ మల్లికాంత బస్సులోనే సువర్ణమ్మకు ప్రసవం చేయగా. అమ్మాయి జన్మించింది. బస్సులో పుట్టిన ఆ బిడ్డకు శాశ్వత బస్‌పాసు ఇస్తామని ఆర్టీసీ ఎండీ సజ్జనార్ ప్రకటించారు. ఆయన ఆదేశానుసారం సువర్ణమ్మకు ఆమె కూతురి పేరిట కొల్లాపూర్ డిపో మేనేజర్ ఉమాశంకర్ శాశ్వత ఉచిత బస్‌పాసును గురువారం అందజేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఆమె జీవితాంతం ఎక్కడైనా ఉచితంగా ఆర్టీసీ బస్సులో ప్రయాణించవచ్చని వివరించారు. అదేవిధంగా ఆశావర్కర్ మల్లికాంతకు ఏడాది కాలానికి ఉచిత బస్‌పాస్ అందజేశారు. కార్యక్రమంలో ఆర్టీసీ ఉద్యోగులు రత్నమ్మ, నజీర్ తదితరులున్నారు.

జూరాలకు పెరిగిన వరద

- 30వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో.. 40, 275 అవుట్‌ఫ్లో
- కొనసాగుతున్న విద్యుదుత్పత్తి

ధరూరు/ఆత్మకూరు: జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి వస్తున్న ఇన్‌ఫ్లో పెరిగినట్లు పీజేపీ అధికారులు తెలిపారు. మంగళవారం ప్రాజెక్టుకు 20వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. బుధవారం సాయంత్రం 6:30 గంటల వరకు ప్రాజెక్టుకు వస్తున్న ఇన్‌ఫ్లో 30వేల క్యూసెక్కులకు పెరిగినటుల్ పేర్కొన్నారు. విద్యుదుత్పత్తి నిమిత్తం 38, 393 క్యూసెక్కులు, నెట్టెంపాడు ఎత్తిపోతల ద్వారా 1,500, కోయిల్‌సాగర్‌కు 315, ఆవిరి రూపంలో 67 క్యూసెక్కులు ప్రాజెక్టు నుంచి మొత్తం 40, 275 క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 9.657 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం ప్రాజెక్టులో 7.971 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు.

దిగువ, ఎగువ జలవిద్యుదుత్పత్తి కేంద్రాల్లో 11 యూనిట్ల ద్వారా విద్యుదుత్పత్తిని చేపడుతునట్లు ఎస్‌ఈ శ్రీధర్ తెలిపారు. ఎగువలో 5యూనిట్ల ద్వారా 195 మెగావాట్లు, 31.353 ఎంయూ, దిగువలో 6 యూనిట్ల ద్వారా 240 మెగావాట్లు, 34.783 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తిని చేపడుతున్నారు. ఎగువ, దిగువ జలవిద్యుదుత్పత్తి కేంద్రాల్లో ఇప్పటి వరకు 66.136 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తిని విజయవంతంగా చేపట్టామన్నారు. ప్రస్తుతం 39వేల క్యూసెక్కులను వినియోగించి విద్యుదుత్పత్తిని చేపడుతున్నామని తెలిపారు.

శ్రీశైలానికి 38,393 క్యూసెక్కులు

దోమలపెంట: జూరాలలో బుధవారం విద్యుదుత్పత్తి చేస్తూ 38,393 క్యూసెక్కుల నీటిని దిగువున్న శ్రీశైలం జలాశయానికి విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం శ్రీశైలంలో నీటిమట్టం 845.1 అడుగుల వద్ద 70.3596 టీఎంసీల నీటినిల్వ ఉంది. 24గంటల వ్యవధిలో రేగుమాన్‌గడ్డ నుంచి ఎంజీకేఎల్‌ఐకి 1,030 క్యూసెక్కులను విడుదల చేశారు. భూగర్భ జల విద్యుత్ కేంద్రంలో 3.441 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తి చేసి 7,525 క్యూసెక్కులు, ఏపీ జెన్‌కో పరిధిలోని కుడిగట్టు కేంద్రంలో 0.088 మిలియన్ యూనిట్లు ఉత్పతి చేసి 176 క్యూసెక్కుల నీటిని దిగువునున్న నాగార్జునసాగర్‌కు విడుదల చేస్తున్నారు.

650బస్తాల వరి విత్తనాలు పట్టివేత

భూత్పూర్: మండలంలోని తాటికొండ శివారులో బుధవారం అనుమతి లేకుండా అక్రమంగా 650 బస్తాల వరి విత్తనాలను విక్రయిస్తున్న డీసీఎంను పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ చంద్రశేఖర్ తెలిపారు. ఎస్‌ఐ కథనం ప్రకారం.. కరీంనగర్ జిల్లా హుజురాబాద్‌లోని పరకాల ఎక్స్ రోడ్డులో ఆది గణపతి సీడ్స్ ప్రాసెసింగ్ ప్లాంట్ నుంచి గద్వాల శ్రీరాజరాజేశ్వరి ట్రేడర్స్‌కు చెందిన యజమాని ఎస్.చంద్ర శ్రీకర్‌రెడ్డి 650బస్తాల్లో రూ.6, 62, 500 విలువైన వరి విత్తనాలను డీఎంలో తీసుకొచ్చాడు. తాటికొండ శివారులో రైతులకు విక్రయిస్తుండగా సమాచారం తెలుసుకున్న ఏఓ మురళీధర్ తనిఖీ చేయగా.. ఎలాంటి అనుమతిపత్రాల్లేకపోవడంతో భూత్పూర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు శ్రీరాజారాజేశ్వరి ట్రేడర్స్ యజమానిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

మనిషి మస్తిష్కానికి పుస్తకమే ఆయుధం



ఆల్బమ్ విడుదల చేస్తున్న గాయని శ్యామల, నాయకులు

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): మనిషి సర్వతోముఖాభివృద్ధికి చదువు ఎంతో ముఖ్యమని, అక్షరాలను పొదిగిన మంచి పుస్తకాలే మనిషి మస్తిష్కానికి ఆయుధాలని కలెక్టర్ విజయేంద్ర బోయి అన్నారు. పుస్తకం ఔన్నత్యం, చదువు విశిష్టతను తెలుపుతూ నంచర్ల సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాల సంగీత ఉపాధ్యాయిని శ్యామల రచన గానంతో రూపొందించిన 'పుస్తకమేరా మనిషి జీవితపు వెలుగు పూలబాట' అనే ఆడియో, వీడియో అల్బమ్‌ను బుధవారం తన చాంబర్‌లో కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నేటి ఆధునిక సమాజంలో విద్యార్థులు, యువత పుస్తకం విస్మరిస్తూ సోషల్ మీడియాకు బానిసలవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. సోషల్ మీడియాతో యువత అప్రమత్తంగా ఉండి ఉన్నత లక్ష్యాలు నిర్దేశించుకోవాలని సూచించారు. శ్యామల పాటలు సామాజిక స్పృహ నింపుతున్నాయని కొనియాడారు. కార్యక్రమంలో కలెక్టరేట్ ఏఓ శంకర్, సీపీఐ జిల్లా కార్యదర్శి బాలకిషన్, ఉపాధ్యాయులు శ్రీనివాస్, రాధ, పంచాయతీ కార్యదర్శి నర్మద, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి సురేష్, ఎస్‌ఎఫ్‌ఐడబ్ల్యూ జిల్లా కార్యదర్శి కొండికంటి పద్మావతి, జనార్దన్, రామచందర్, రణధీర్, కృష్ణ, దేవానంద్, శిరీష, సింధు, స్ఫూర్తి పాల్గొన్నారు.


గోదాంలో మిరప సంచుల గోల్‌మాల్



కోల్డ్‌స్టోరేజీ వద్ద తనిఖీ చేస్తున్న పోలీసులు

ఎర్రవల్లి: మండలంలోని వేముల శివారులో ఉన్న మెగా చిల్ కోల్డ్ స్టోరేజీలో మిరప సంచుల గోల్‌మాల్ జరిగింది. పోలీసులు రంగంలోకి దిగి విచారణ చేపట్టడంతో తిరిగి సంచులను బాధితుడికి అప్పగించారు. వివరాల్లోకి వెళ్తే.. కర్నూలుకు చెందిన మిర్చి వ్యాపారి రసూల్‌మియా 2023లో 449 ఎండు మిర్చి (2043 రకం) బస్తాలను కోదండాపురం, మునుగాల, నీలిపల్లి గ్రామాల రైతుల వద్ద కొనుగోలు చేసి ధరలు పడిపోవడంతో వేముల శివారులో ఉన్న మెగా చిల్ కోల్డ్‌స్టోరేజీలో నిల్వ చేశారు. ఇటీవల రసూల్‌మియా కుటుంబ సభ్యులతో కలిసి కోల్డ్ స్టోరేజీకి వెళ్లి తన బస్తాలను చూపించాలని మేనేజర్‌తో పాటు యజమానిని కోరినా స్పందించలేదు. దీంతో మంగళవారం కోదండాపురం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్‌ఐ మురళి సిబ్బందితో కలిసి కోల్డ్ స్టోరేజీకి వెళ్లి సోదాలు చేసి 289 బస్తాల మిర్చిని గుర్తించారు. అలంపూర్ సీఐ రవిబాబు ఆధ్వర్యంలో మిర్చి బస్తాలను బుధవారం బాధితుడికి అప్పగించారు. మిగిలిన బస్తాలను కూడా గుర్తించి బాధితుడికి న్యాయం చేస్తామని సీఐ వివరించారు. వ్యాపారి రైతుల నుంచి మిర్చి బస్తాలు కొనుగోలు చేసిన తర్వాత గోదాంలో రైతుల పేరున ఉన్న బాండ్లలో తన పేరును నమోదు చేయించుకోలేదని.. రైతులు వచ్చి అడుగుతారనే ఉద్దేశంలో కోల్డ్‌స్టోరేజీ యాజమాన్యం సంచులు ఇవ్వలేదని సీఐ రవిబాబు తెలిపారు.

అల్లం సాగు.. లాభాలు బాగు



అల్లం 20 రోజుల పంట



అల్లం గడ్డ

పాడి-పంట
జిల్లా వ్యవసాయాధికారి, సక్రియానాయక్

అలంపూర్: సాంప్రదాయ పంటల సాగులో వస్తున్న నష్టాల నుంచి గట్టెక్కడానికి అన్నదాతలు వాణిజ్య పంటల సాగుపై దృష్టి కేంద్రికరీస్తున్నారు. జిల్లా పరిధిలో పలు రకాల వాణిజ్య పంటలు సాగు చేస్తూ లాభాల బాట పడుతున్నారు. వరి పంట కంటే తక్కువ నీటితో అల్లం సాగుచేసే అవకాశం ఉండటంతో రైతులు అల్లం సాగుకు పూనుకుంటున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సక్రియ నాయక్ అల్లం పంట సాగుపై పలు సూచనలు ఇచ్చారు.

అనువైన నేలలు :

అల్లం సాగుకు ఎర్రనేలలు అనువుగా ఉంటాయి. నీరు నిల్వ ఉండని నేలల్లో పంట సాగు అనుకూలం. వరిసాగుతో పోల్చుతే నీటి వినియోగం చాల తక్కువగా ఉంటుంది. ఎకరా పొలంలో వరి సాగు చేయడానికి కావాల్సిన నీటితో ఒక్కటిన్నర ఎకరంలో అల్లం సాగు చేసుకోనే వెసులుబాటు ఉంటుంది.

రకాలు– లభ్యత :

మారన్ విత్తనాలు మంచి దిగుబడిని ఇస్తాయి. దీనిని కేరళ నుంచి దిగుమతి చేసుకోవాల్సి ఉంటుంది. మహావ రకం మహారాష్ట్రలో లభిస్తోంది. ఇవే కాక కేరళలో ఎర్నాడ్, వేనాడ్, కరుప్పం పాడి, నడియా అల్లం రకాలు ప్రసిద్ధిగాంచినవి.

పంట సాగు కాలం :

ఎనిమిది నుంచి తొమ్మిది నెలల్లో పంట చేతికి అందుతుంది.

విత్తన మోతాదు :

ఎకరానికి 1,000 కేజీల విత్తనాలు కావాల్సి ఉంటుంది. 20 రోజులపాటు కుప్పగా వేసి మండె కట్టాలి. మండె కట్టిన 20 రోజుల అనంతరం విత్తిన దుంపలు చిన్నచిన్న మొలకలు రాగానే వాటిని 30 గ్రాముల బరువు ఉండేలా కత్తిరించాలి. వీటిని లీటర్ నీటికి 3 గ్రాముల మాంకోజెబ్, 2 మి.లీ క్లోరోపైరిపాస్ కలిపి 30 నిమిషాలు నానబెట్టి భూమిలో విత్తాలి. విత్తిన 3– 5 వారాల్లో పూర్తిగా మొలక వస్తోంది. ప్రతిరోజు 6 గంటల పాటు డ్రిప్‌తో నీటిని అందించాలి.

విత్తే సమయం :

సాధారణ సమయాల్లో జూన్ నెలలో అల్లం పంట సాగు చేసుకోవచ్చు. నీటి పారుదల ఉంటే ఫిబ్రవరిలో లేదా మార్చి నెలల్లో సాగు చేపట్టొచ్చు.

ఎరువులు :

పిలక దశలో మొదటి నాలుగు నెలలు యూరియా 20: 20 ఎరువులు రోజు మార్చి రోజు డ్రిప్ ద్వారా అందించాలి. దుంప ఎదుగుదల దశలో 13: 0: 45 ఎరువులు 3 నుంచి 5 నెలల వరకు ప్రతినెల ఒకసారి ఇవ్వాలి. వీటితోపాటు మెగ్నీషియం సల్ఫేట్, కాల్షియం నైట్రేట్ అందించాలి.

తెగుళ్ల యాజమాన్యం :

అల్లం సాగులో ప్రధానంగా దుంపకుళ్లు తెగులు, బ్యాక్టీరియా ఆకుమచ్చ తెగులు ఆశించొచ్చు. వీటి వలన 30– 50 శాతం వరకు పంట దిగుబడి తగ్గే అవకాశం ఉంది. దుంప కుళ్లును గుర్తించినట్లయితే మెటలాక్సిల్ 1 గ్రాము లీటర్ నీటిలో కలిపి వేరు ప్రాంతం తడిచేలా పోయాలి. ఈ విధంగా పది రోజుల వ్యవధిలో రెండుసార్లు చేయాల్సి ఉంటుంది.

వేడిగాలుల నుంచి రక్షణ :

అల్లం మొలకెత్తిన తర్వాత బోదెలకు రెండు వైపులకు కింది భాగంలో 30 సెంటీమీటర్ల దూరంలో మొక్కజొన్న నాటుకోవాలి. దీని వలన పిలక దశలో అల్లం పంటను వేడి గాలులు, అధిక ఉష్ణోగ్రతల నుంచి కాపాడుకోవచ్చు.

దిగుబడి :

ఎకరానికి 15 నుంచి 20 టన్నుల దిగుబడి వస్తోంది. ప్రస్తుతం మార్కెట్‌లో టన్ను ధర రూ.30 వేల వరకు పలుకుతుంది. దీంతో సుమారు ఎకరాకు రూ.2 లక్షల వరకు ఆదాయం సమకూరే అవకాశం ఉంది.

దుక్కి ఇలా...

అల్లం సాగులో దుక్కి చాల ముఖ్యమైంది. దుక్కిని 30 సె.మీ లోతు వరకు దున్నాలి. ఆఖరి దుక్కిలో ఎకరానికి 10 ట్రక్కుల బాగా చివికిన పశువుల ఎరువు, 150 కేజీల సూపర్, 30 కేజీల పొటాష్ వేసుకోవాలి. కనీసం 30 సె.మీ ఎత్తు, బోదె పైభాగం, 90 సె.మీ ఉండేలా 4 అడుగుల వెడల్పుతో బోదెలు తయారు చేసుకోవాలి. నీటి తడుల కోసం బోదెల మధ్య ఇన్‌లైన్ డ్రిప్ అమర్చుకోవాలి.

ట్రాక్టర్ బోల్తాపడి యువకుడి మృతి

కొల్లాపూర్ రూరల్: మండలంలోని ఎన్మన్‌బెట్ల గ్రామానికి చెందిన పెబ్బేటి పవన్ (30) ట్రాక్టర్ బోల్తా పడడంతో మృతి చెందిన ఘటన బుధవారం చోటు చేసుకుంది. గ్రామస్తులు చెప్పిన వివరాల ప్రకారం.. పవన్ కొల్లాపూర్ నుంచి ట్రాక్టర్‌పై గ్రామానికి వస్తున్నాడు. ఈ క్రమంలో ట్రాక్టర్‌కు సింగిల్ బ్రేక్‌ను వేయడంతో ట్రాక్టర్ బోల్తా పడింది. ట్రాక్టర్‌కు రూటర్‌వేటర్ ఉండడంతో అందులో ఇరుక్కొని పవన్ అక్కడిక్కడనే మృతి చెందాడు. మృతుడికి భార్య పల్లవి, కుమార్తె ఉన్నారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

- పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళన



శేఖర్ (ఫైల్)

ఉప్పునుంతల: విద్యుదాఘాతానికి గురై ఓ యువకుడు మృతిచెందిన ఘటన మండలంలోని కంసానిపల్లిలో బుధవారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. గ్రామస్తులు, ఎస్‌ఐ వెంకట్‌రెడ్డి కథనం మేరకు.. మండల కేంద్రానికి చెందిన మదనాగుల శేఖర్ (27) విద్యుత్ దినసరి కూలీగా పని చేస్తుండేవాడు. కంసానిపల్లి ఫీడర్‌లో అసిస్టెంట్ లైన్‌మెన్‌గా పనిచేస్తున్న వెంకటేష్‌కు కొంతకాలం కిందట కాలు విరగడంతో ఇటీవలే విధుల్లో చేరారు. బుధవారం కంసానిపల్లి ఫీడర్ బ్రేక్‌డౌన్ కావడంతో విద్యుత్ అంతరాయం ఏర్పడింది. దానిని సరిచేయడానికి లైన్‌మెన్ వెంకటేష్ ఉప్పునుంతలకు చెందిన శేఖర్‌ను వెంట తీసుకువెళ్లాడు. శేఖర్ స్తంభంపైకి ఎక్కి తీగలను సరిచేస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందాడు. వెంటనే కుటుంబసభ్యులతో పాటు గ్రామస్తులు పెద్దఎత్తున ఘటనా స్థలానికి చేరుకొని ఆందోళన చేపట్టారు. బాధిత కుటుంబానికి తగిన సాయం చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఉప్పునుంతల సబ్‌స్టేషన్ ఎదుట రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో చేశారు. ఎస్‌ఐ వెంకట్‌రెడ్డి వారికి సర్దిచెప్పి పోలీస్‌స్టేషన్ వద్దకు తీసుకెళ్లారు. గ్రామపెద్దలు అనంతరెడ్డి, నరేందర్‌రెడ్డి తదితరులు ఇన్‌చార్జ్ ఏడీఈ ఆంజనేయులు, ఏఈ కొండలు, సిబ్బందితో చర్చలు జరిపి బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందించేలా రాజీ కుదిర్చారు. అనంతరం మృతదేహాన్ని స్తంభంపైనుంచి కిందకు దింపి పోస్టుమార్టం నిమిత్తం అచ్చంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. శేఖర్‌కు భార్య లావణ్య, రెండేళ్ల కుమారుడు ఉండగా.. ప్రస్తుతం గర్భంతో ఉంది. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్‌ఐ వివరించారు.



పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళన చేస్తున్న బాధిత కుటుంబ సభ్యులు, గ్రామస్తులు